ఆంధ్రజ్యోతి

సోమవారం ఉష్ణోగ్రత గరిష్టం 31.4; కనిష్టం 21.8



కామారెడ్డి
జిల్లా వార్తలు

3

మంగళవారం 27 ఫిబ్రవరి 2024

రాష్ట్రస్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్‌కు విద్యార్థుల ఎంపిక

బీర్కూర్, ఫిబ్రవరి 26: సైన్స్ దినోత్సవం సందర్భంగా ప్రతీ సంవత్సరం లాగే ఈసారి కూడా బీర్కూర్ మండలకేంద్రంలో విద్యార్థులకు సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. సైన్స్ టాలెంట్ టెస్ట్, సన్‌రైజ్ స్కూల్లో నిర్వహించగా పెద్దసంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. ఈ టెస్టులో శైలజ, అక్షిత, మనోజ, ప్రహర్షిని, సాయి, ప్రతీక్ ప్రతిభ కనబర్చి రాష్ట్రసాయి సైన్స్ టాలెంట్ టెస్ట్‌కు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని సంస్థ ప్రతినిధులు రాకేష్, ప్రకాష్, విజయ్ కుమార్ ప్రకటించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మల్లెల రాజశేఖర్ విద్యార్థులను అభినందించారు.



- జిల్లాలో రోజురోజుకూ పెరుగుతున్న విద్యుత్ వినియోగం
- ఒకేరోజు 64.34 లక్షల యూనిట్ల ఖర్చు కరెంట్
- వ్యవసాయానికే అత్యధికంగా..
- అధికంగా నమోదయ్యే ప్రాంతాలపై విద్యుత్ శాఖ కార్యాచరణ
- నో పవర్ కట్ అనే నినాదంతో ముందుకు..
- అధిక లోడింగ్ ఉన్న ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు
- 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాల్లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు

పవర్ ఫుల్ డిమాండ్!



కామారెడ్డి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోజురోజుకూ విద్యుత్ వినియోగం పెరిగిపోతోంది. ఎండలు పెరుగుతుండడంతో ప్రజా అవసరాలకే కాకుండా వ్యవసాయానికి అధిక మొత్తంలో విద్యుత్ వినియోగం అవుతున్నట్లు విద్యుత్‌శాఖ అధికారులు పేర్కొంటున్నారు. వ్యవసాయానికి 24గంటల ఉచిత విద్యుత్ ఇస్తుండడం, ప్రస్తుతం యాసంగి కావడంతో పంటలకు నీటి వినియోగం ఎక్కువ అవుతుండడంతో విద్యుత్ కోతలు లేకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. విద్యుత్ కోతలు విధిస్తే సంబంధిత శాఖాధికారులపై చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం హెచ్చరించింది. దీంతో నిమిషం కూడా విద్యుత్ కోతలు ఉండవనే ఆదేశాలతో నో పవర్ నోకట్ అనే నినాదంతో జిల్లాలో విద్యుత్‌శాఖ అధికారులు ఈ వేసవి కాలానికి కార్యాచరణను రూపొందించారు. ఈ వేసవిలో అన్ని కేటగిరిలలో వినియోగదారుల విద్యుత్ వినియోగం విపరీతంగా పెరుగుతోంది. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని వేసవి కాలానికి సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు నాణ్యమైన అంతరాయం లేని విద్యుత్ అందించడానికి జిల్లా విద్యుత్‌శాఖ అధికారి రమేష్‌బాబు క్షేత్రస్థాయిలో అధికారులతో సమీక్ష నిర్వహిస్తూ అధికారులను, సిబ్బందిని అప్రమత్తం చేశారు. జిల్లాలోని 135, 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాల ద్వారా సరఫరా జరుగుతోంది. వీటి ద్వారా విద్యుత్ సరాఫరాలో హెచ్చుతగ్గులు లేకుండా విద్యుత్ పంపిణీ సక్రమంగా జరగడానికి చర్యలు తీసుకుంటున్నారు. వేసవిలో వచ్చే ఉష్ణోగ్రతల మార్పులతో విద్యుత్ వాడకం గృహ అవసరాలు, అన్నిరకాల విద్యుత్ కేటగిరిలలో పెరగనుంది. అదనపు భారాన్ని దృష్టిలో ఉంచుకుని ఎప్పటికప్పుడు విద్యుత్ పరికరాలు, ట్రాన్స్ ఫార్మర్‌ల స్థాయిలను పెంచుటకు అధికారులు సిద్ధమయ్యారు.

పెరుగుతున్న విద్యుత్ వినియోగం

జిల్లాలో విద్యుత్ వినియోగం భారీగా పెరుగుతోంది. జిల్లా ప్రజలు ఆదివారం ఒకేరోజు 64.34 లక్షల యూనిట్ల విద్యుత్ వినియోగించారు. సాధారణ రోజుల్లో రోజుకు 46లక్షల యూనిట్ విద్యుత్ వినియోగం అయ్యేదని విద్యుత్‌శాఖ అధికారులు చెబుతున్నారు. గత 15 రోజుల్లో 350 మెగావాట్ల యూనిట్ల విద్యుత్ వినియోగం నమోదైంది. 2022 డిసెంబర్‌లో 102.28 లక్షల మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం కాగా 2023 డిసెంబర్‌లో 105.34 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగమైంది. 2023 జనవరిలో 135.51 మిలియన్ యూనిట్లు, 2024 జనవరిలో 160.02 మిలియన్ యూనిట్లు విద్యుత్ వినియోగం జరిగింది. 2023 ఫిబ్రవరిలో 132.45 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరుగగా ప్రస్తుతం 152.78 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం అయినట్లు విద్యుత్ శాఖ అధికారుల రికార్డులు చెబుతున్నాయి.

అధికంగా వినియోగించే ప్రాంతాలపై కార్యాచరణ

వేసవి కాలంను దృష్టిలో ఉంచుకుని వారం రోజులుగా విద్యుత్ శాఖ అధికారులు ఉపకేంద్రాల వారిగా, ఫీడర్ల వారిగా, ట్రాన్స్‌ఫార్మర్ల వారిగా విద్యుత్ అదనపు వినియోగాన్ని గుర్తిస్తూ అదనంగా భారం పడే ట్రాన్స్‌ఫార్మర్లను, మిగితా లైన్లను గుర్తించి వాటిస్థానంలో అదనంగా ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసేందుకు సంబంధిత శాఖ అధికారులు కార్యాచరణను రూపొందించారు. మరో 15 రోజుల్లో విద్యుత్ వినియోగం అధికం అవుతుందని, దీంతో లోడింగ్ ఉన్న ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసేందుకు శాఖ చర్యలు చేపడుతోంది.

33/11కేవీ ఉపకేంద్రాల్లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు

జిల్లాలో అధికలోడ్‌తో ఉన్న విద్యుత్ కేంద్రాలను సంబంధిత శాఖ అధికారులు గుర్తించారు. జిల్లాలోని ఆరేపల్లి, అన్నారం, ఎల్లంపేట, మేనురు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ వినియోగం అధికంగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ సబ్ స్టేషన్లలో అదనంగా 5ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్లకు సంబంధించిన పనులకు మంజూరు లభించిందని త్వరలోనే పనులు పూర్తిచేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

విద్యుత్ కోతలు విధిస్తే చర్యలు

నో పవర్ కట్ అనే నినాదంతో జిల్లా విద్యుత్‌శాఖాధికారులు రాబోయే వేసవిలో చేపట్టాల్సిన కార్యచరణ రూపొందించుకుని రెండు రోజులుగా విద్యుత్‌కేంద్రాల వారిగా శాఖ ఉన్నతాధికారి రమేష్‌బాబు ఆధ్వర్యంలో డీఈ, ఏడీఈ, ఏఈలు క్షేత్రస్థాయిలో ఎఫ్ఎం, ఎస్ఎల్ఐ, ఎల్ఐ, ఎల్ఎం, ఏఎల్ఎం, జేఎల్ఎంలతో సమావేశాలు నిర్వహించి విద్యుత్ సరాఫరాకు ఎలాంటి అవంతరాలూ లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు చేయాల్సిన కార్యాచరణను రూపొందించారు. అధికారుల సమాచారం లేకుండా ఎక్కడైన విద్యుత్‌సరాఫరాను నిలిపివేస్తే శాఖపరంగా చర్యలు తీసుకోనున్నారు.

కోతలు లేని నాణ్యమైన విద్యుత్ అందిస్తాం

● రమేష్‌బాబు, ఎస్‌ఈ



జిల్లాలో కోతలు లేని నాణ్యమైన విద్యుత్ సరాఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. వినియోగదారులు మా దృష్టికి తీసుకువచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం. వ్యవసాయానికి గృహ అవసరాలకు విద్యుత్ కోతలు లేకుండా చూస్తున్నాం. విద్యుత్ సిబ్బంది, అధికారుల సమాచారం లేకుండా ఎక్కడైనా విద్యుత్ కోతలు విధిస్తే వారిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా విద్యుత్‌శాఖ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను సైతం ఏర్పాటు చేశాం.

పది పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

కామారెడ్డిటౌన్, ఫిబ్రవరి 26: పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్, డీఈవోలను సీఎస్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్చ్ 18 నుండి ఏప్రిల్ 2 వరకు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పరీక్షలు కొనసాగుతాయని తెలిపారు. ఎటువంటి చిన్న సంఘటనకూ తావివ్వకుండా ఎన్నికల విధుల మాదిరే అత్యంత జాగ్రత్తతో పనిచేయాలని లేకుంటే చిన్న ఘటన కూడా వైరల్ అయి విద్యార్థులకు నష్టం జరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. విధులు కేటాయించిన అధికారులు వెంటనే ఆయా పరీక్ష కేంద్రాలను సందర్శించి పర్నీచర్, విద్యుత్, మంచినీరు, వెలుతురు వంటి మౌలిక సదుపాయాలను పరిశీలించాలన్నారు. జిల్లాలో రెగ్యులర్, ప్రైవేట్ విద్యార్థులు 11962మంది పరీక్షలు రాయనున్నారని అందులో 5384 మంది బాలు రు కాగా 6128 మంది బాలికలు ఉన్నారని 62 పరీక్ష కేంద్రాలను ఏర్పాటుచేశామని తెలిపారు. ఎటువంటి మాల్‌ప్రాక్టిస్,కాపీయింగ్‌కు తావివ్వకుండా చూడాలని అన్నారు. సమావేశంలో డీఈవో రాజు, పరీక్షల విభాగం సహాయ కమీషనర్ లింగం, చీఫ్ సూపరిటెండేంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

● మార్చి 3న పల్స్‌పోలియో కార్యక్రమం

మార్చి 3నపల్స్‌పోలియో కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో పల్స్‌పోలియో కార్యక్రమ నిర్వహణపై ఏర్పాటుచేసిన టాస్క్‌ఫోర్స్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలీయో చుక్కలు వేసేందుకు గ్రామీణ,పట్టణ ప్రాంతాలలో 733 పోలియో బృందాలతో పాటు మరో 48 సంచార బృందాలను ఏర్పాటుచేసి 2932 మంది ఏఎన్ఎం,ఆశకార్యకర్తలు, 69 మంది సూపర్‌వైజర్‌ల సేవలను ఉపయోగించనున్నామన్నారు. అదేవిధంగా మరో 24 ఆరోగ్య కేంద్రాలలో పోలియో చుక్కలు వేయనున్నామని తెలిపారు.పంచాయతీ కార్యదర్శులు గ్రామాలలో చాటింగ్ వేయించాలని, చెత్తసేకరణ ట్రాక్టర్ల ద్వారా ఆడియో ప్రదర్శించాలన్నారు. శతశాతం చిన్నారులకు పోలియో చుక్కలు వేయించడంలో ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డీయంహెచ్‌వో లక్ష్మన్‌సింగ్, ఇమ్యూనైజేషన్ అధికారి అనిల్, ఐసీడీఎస్ పీడీ బావయ్య, దయానంద్, శ్రీనివాస్, లాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

● సైబర్‌నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ లావాదేవీలపై ప్రతీఒక్కరికి అవగాహన ఉండాలని కలెక్టర్ జితేష్‌వి.పాటిల్ అన్నారు. సోమవారం రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ముద్రించి న గోడ ప్రతులను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు మనిఈజీ మనికోసం అలవాటు పడ్డారని, తద్వారా మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. కష్టపడి సంపాదిస్తే డబ్బు విలువ తెలియడంతో పాటు సరైన మార్గంలో పొదుపుగా ఖర్చుపెడతారని అన్నారు. విద్యార్థులకు డిజిటల్ లావాదేవిలు, డబ్బు పొదుపు, చక్రవడ్డీ, మ్యూచ్‌వల్ ఫండ్‌పై అవగాహన కలిగించాలని తెలిపారు. బ్యాంక్ వివరాలు ఎవరికి చెప్పొద్దని వివరించారు.

● ప్రజావాణికి 50 ఫిర్యాదులు

కామారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి 50 పీర్యాదులు వచ్చినట్లు కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. ఇందులో ధరణికి సంబంధించి 26, గ్రామపంచాయతీ 9, సర్వే అండ్ ల్యాండ్ రికార్డు 4,మున్సిపల్ 3, ఎస్‌సీ, హౌసింగ్, డీఆర్‌డీవో 2 చొప్పున, విద్యుత్, డీఎంహెచ్‌వో 1 చొప్పున పీర్యాదులు వచ్చాయని తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్తి తగాదాలకు సంబంధించి కోర్టును ఆశ్రయించాలని, కోర్టు తీర్పులను అమలుచేస్తామని పిర్యాదుదారులకు సూచించారు. ప్రజావాణిలో వస్తున్న పీర్యాదులను శాఖలవారిగా స్వీకరించి పెండింగ్ లో పెట్టకుండా వాటి పరిష్కారానికి ప్రాదాన్యత ఇవ్వాలని తెలిపారు. జిల్లాలోని ఆయా ప్రభుత్వ వసతిగృహాలకు కూరగాయలు, గుడ్లు, ఆహారపు దినుసుల, మాంసం అందిస్తున్న బిల్లులు రావడం లేదని కాంట్రాక్టర్‌లు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. 6 నెలలుగా బిల్లులు రావడం లేదని, వివరించారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణారెడ్డి, దీపక్‌రెడ్డి, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు

గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలి

● వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు


బాన్సువాడ,ఫిబ్రవరి26: రానున్న పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు మెజార్టీ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావుపిలుపునిచ్చారు. సోమవారం బాన్సువాడ నియోజకవర్గంలోని రుద్రూర్ మండల కేంద్రంలో దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి వెళ్తున్న సందర్భంగా బాన్సువాడ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు కష్టపడి పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు ఏనుగు రవీందర్‌రెడ్డితోపాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సన్మానించి ఘనస్వాగతం పలికారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియాగాంధీ రుణం ఎన్నటికీ తీర్చుకోలేమన్నారు. తనకు రాజకీయభిక్ష పెట్టిన దివంగత సీఎం ఎన్టీఆర్ విగ్రహావిష్కరణకు రావడం ఎంతో ఆనందంగా ఉందని మంత్రి అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలన లో అవినీతి పేరుకుపోయిందని, ప్రజల ఆకాంక్షలు నెరవేర్చకుండా కాలయాపన చేశారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన ఆరుగ్యారంటీల హామీలను తప్పకుండా నెరవేరుస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి, ప్రముఖ వ్యాపారవేత్త మోరిల్ శ్రీనివాస్, యలమంచిలి శ్రీనివాస్, మాసాని శ్రీనివాస్‌రెడ్డి, మాసాని శేఖర్‌రెడ్డి, ప్రతాప్ సింగ్, తదితరులున్నారు.

● కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు, కౌన్సిలర్లు

బాన్సువాడ బీఆర్ఎస్ పార్టీ పట్టణాధ్యక్షుడు పాత బాలకృష్ణతో సహా నలుగురు కౌన్సిలర్లు సోమవారం ఉదయం హైదరాబాద్‌లోని ఏనుగు రవీందర్‌రెడ్డి నివాసంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి మంత్రి తుమ్మల కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అదేవిధంగా బాన్సువాడ నియోజకవర్గంలోని వర్ని మండల ఎంపీపీ మేకవీర్రాజు దంపతులతోపాటు బాన్సువాడ పట్టణానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు అర్థం శేఖర్, మహర్షి శివ, దత్తు, నాగులగామ శివతోపాటు మండలంలోని పలువురు సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో మంత్రి తుమ్మల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వచ్చే పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించేలా కృషిచేయాలని కోరారు. పార్టీలో చేరిన వారిలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు బాడీ శ్రీనివాస్, రమాదేవి, రుక్మిణి, షైమద్ దంపతులు ఉన్నారు.

- ముమ్మరంగా కొనసాగుతున్న ఆస్తి పన్ను వసూళ్లు
- లక్ష్యాన్ని అధిగమించేందుకు ప్రత్యేక కార్యాచరణ
- కామారెడ్డి మున్సిపాలిటీలో రూ.8.83 కోట్ల బకాయిలు
- ఇప్పటివరకు వసూలైంది రూ.5 కోట్ల37 లక్షలే..
- వసూళ్లకు 15 బృందాల ఏర్పాటు
- మొండి బకాయిదారులకు రెడ్ నోటీసులు

లక్ష్యం దిశగా అడుగులు!





కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 26: కామారెడ్డి మున్సిపాలిటీలో ఆస్తి పన్ను వసూళ్లు.. లక్ష్యం దిశగా అడుగులు వేస్తోంది. తెలంగాణ ప్రభుత్వం నిర్దేశించిన పన్ను వసూళ్ల లక్ష్యాన్ని అధిగమించేందుకు అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ఇంటింటికీ వెళ్తూ అక్కడికక్కడే పన్ను వసూళ్లను చేపడుతున్నారు. వచ్చేనెల 31 వరకు ఆర్థిక సంవత్సరానికి సంబంధించి చివరిరోజు కావడంతో బిల్‌కలెక్టర్‌లతో వసూళ్ల ముమ్మరం చేయించారు. వసూళ్లలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఉన్నతాధికారులు సైతం ఆయా సమావేశాలలో సూచిస్తున్నారు. మొత్తం 15 బృందాలను ఏర్పాటుచేసి బృందానికి ఇద్దరు చొప్పున మొత్తం 49 వార్డులలో 30 మందితో పన్ను వసూళ్లను చేపడుతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. 100 పైనే మొండి బకాయిదారులకు రెడ్ నోటీసులు జారీ చేశారు.

● బకాయిల లక్ష్యం రూ.8.83 కోట్లు

కామారెడ్డి మున్సిపాలిటీలో మొత్తం 49వార్డులలో 27,144 గృహాలు ఉండగా, ఇందులో 3,048 కమర్షియల్ ఇళ్లు ఉన్నాయి. ఈ గృహాలకు సంబంధించి పన్ను వసూళ్ల లక్ష్యం రూ.8 కోట్ల 83లక్షలు ఉంది. ఇప్పటికే రూ.5 కోట్ల 37లక్షల పన్నులను మున్సిపల్ సిబ్బంది వసూళ్లు చేసింది. ఇంకో రూ.3కోట్ల 48 లక్షల పన్నులను వచ్చే నెల చివరివరకల్లా పూర్తిచేస్తామని అధికారులు పేర్కొంటున్నారు. కాగా గతంలో మాదిరి పన్ను రాయితీ ప్రకటిస్తారమోనని ఆశించి పన్ను చెల్లించడంలో ప్రజలు నిర్లక్ష్యం వహించారని తెలుస్తోంది. ప్రస్తుతం 15 బృందాలతో ప్రతీ వార్డుల్లో పన్ను వసూళ్లను ముమ్మరంగా చేస్తుండడంతో లక్ష్యం వైపు ఆస్తిపన్ను వసూలు చేరుకుంటుంది. ఇప్పటికే 63 శాతానికి పైగా పన్ను వసూలు చేపట్టారు. మరో నెల రోజుల సమయంలో మిగిలిన పన్నులను వసూలు చేసి లక్ష్యాన్ని చేరుకుంటామని అధికారులు పేర్కొంటున్నారు.

● డిజిటల్ పద్ధతిలను చెల్లించే అవకాశం

గతంలో ఆస్తిపన్నులు చెల్లించాలంటే మీసేవ కేంద్రం, మున్సిపల్ కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చేది. రాష్ట్ర మున్సిపల్ శాఖ సాంకేతికంగా పన్నులు చెల్లించేందుకు అవకాశం కల్పించిందని, ఇంటి వద్ద నుంచి సైతం పన్నులు చెల్లించవచ్చని మున్సిపల్ అధికారులు పేటఇక్కంటున్నారు. చేతిలో డెబిట్‌కార్డు, స్మార్ట్‌ఫోన్ ఉంటే చాలని సీడీఎంఏ వెబ్ సైట్ ద్వారా ఇంటి వద్ద నుంచే డిజిటల్ పద్ధతిలో పన్నులు చెల్లించవచ్చు. అలా చెల్లించేందుకు ఇబ్బందులు ఉంటే బిల్ కలెక్టర్‌లు నిత్యం ఇంటింటికీ వచ్చి పన్నులు వసూళ్లు చేపడుతున్నందున వారికే పన్నులు చెల్లించే అవకాశం ఉంది.

● మొండి బకాయిదారులకు రెడ్ నోటీసులు

సుదీర్ఘకాలం పాటు పన్నులు చెల్లించని 100 మందికి పైగా రెడ్ నోటీసులు పంపారు. ఎన్నిసార్లు పన్ను చెల్లించాలని విన్నవించినా పట్టించుకోకపోవడంతో రెడ్ నోటీసులు అందించి అవసరమైతే ఆస్తుల జప్తు సైతం చేసేందుకు సిద్ధమవుతున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే 63 శాతంపైగా లక్ష్యాన్ని సాధించామని మిగిలిన లక్ష్యాన్ని అధిగమించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని అధికారులు చెప్తున్నారు. మున్సిపల్ రెవెన్యూ విభాగం అధికారి పర్యవేక్షణలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌లతోపాటు 30మంది బిల్ కలెక్టర్‌లు ఉదయం 7గంటల నుంచే వార్డుల్లో ఇంటింటికీ వెళ్తు పన్ను వసూళ్లు చేస్తున్నారని, నిత్యం ఆయా వార్డుల్లో చెత్తసేకరణ ఆటోలలో పన్ను చెల్లింపులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.



ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

నవీపేట, ఫిబ్రవరి 26: మండలంలోని నాగేపూర్‌కు చెందిన బోడిగం రాజు(40)అనే వ్యక్తి ఆదివారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై యాదగిరి గౌడ్ తెలిపారు. నాయీబ్రాహ్మణ వృత్తిని చేసే రాజు మద్యానికి బానిసయ్యాడని, మద్యం మత్తులో ఆత్మహత్య చేసుకున్నాడని పేర్కొన్నారు. మృతుడికి భార్య గంగామణి, కూతురు, కుమారుడు ఉన్నారని, భార్య ఫిర్యాదు మేరకు కేసు చేశామని ఎస్సై తెలిపారు.

ఆటో, కారు ఢీ : ఒకరికి గాయాలు

రుద్రూరు, ఫిబ్రవరి 26: మండలంలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణకు వెళుతున్న స్థానిక ఎమ్మెల్యే కాన్వాయ్‌లో ఓ కారుకి ఎదురుగా రుద్రూరు వైపు నుంచి వస్తున్న ఆటో డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తతో రుద్రూరు గ్రామ శివారులో కారును ఢీకొట్టారని ఎస్సై మహేందర్ తెలిపారు. ఈ ఘటనలో ఆటో డ్రైవర్‌కు గాయాలయ్యాయని, కారు డ్రైవర్ భూక్య సతీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై తెలిపారు.

సొంత బైక్‌కు నిప్పంటించిన యువకుడు

నవీపేట, ఫిబ్రవరి 26: మండల కేంద్రంలోని దర్యాపూర్‌కు చెందిన పీ. సాయికుమార్ అనే యువకుడు ఆదివారం రాత్రి తన సొంత బైక్‌కు నిప్పంటించాడు. స్థానికుల వివరాల ప్రకారం.. సాయికుమార్ తన బామ్మర్దికి రూ.2,500 ఇవ్వాల్సి ఉండగా.. అతడు ఫోన్‌లో డబ్బులు వెంటనే ఇవ్వాలని లేకపోతే బైక్‌ను తీసుకువెళ్తానని పేర్కొన్నాడు. కోపంతో తన బైక్‌కు సాయికుమార్ నిప్పంటించాడు. విషయం తెలిసి అక్కడికి వచ్చిన ఎస్సై యాదగిరిగౌడ్ మంటలను ఆర్పివేయించారు.



'మాటు కాలువను ఆధునికీకరించాలి'

నవీపేట, ఫిబ్రవరి 26: మండలంలోని జన్నేపల్లి మాటు కాలువను ఆధునికీకరించాలని పలువురు రైతులు ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని కోరారు. సోమవారం జన్నేపల్లి క్రాసింగ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఓ బైక్ షోరూమ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను పలువురు రైతులు కలిశారు. జన్నేపల్లిలోని జీరో పాయింట్ వద్ద మాటు కాలువకు బుంగలు ఏర్పడ్డాయని వెంటనే వీటిని పూడ్చివేయించాలని కోరారు. అలాగే మాటు కాలువలో పూడిక పెరిగిపోయినందున పూడికను తొలగించి కాలువను ఆధునికీకరించాలన్నారు. మాటు కాలువ మరమ్మతుకు తగిన చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు రైతులు పేర్కొన్నారు.

అబాకస్ పోటీ పరీక్షకు విద్యార్థి ఎంపిక

ఆర్మూర్ రూరల్, ఫిబ్రవరి 26: జాతీయస్థాయి అబాకస్ పోటీ పరీక్షలకు ఆర్మూర్‌లోని శ్రీభాషిత పాఠశాల విద్యార్థి భూమేష్ చంద్ర ఎంపికయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లోని కుక్కట్‌పల్లిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అబాకస్ పరీక్షల్లో శ్రీబాషిత విద్యార్థులు మనస్వీ, అక్షిత, రిషిక, భూమేష్‌చంద్ర పాల్గొన్నారు. వీరిలో భూమేష్‌చంద్ర స్టార్ జూనియర్ లెవల్-2లో రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో నిలిచి వచ్చేనెలలో హైదరాబాద్‌లో జరగనున్న పోటీ పరీక్షలకు ఎంపికైనట్టు కరస్పాండెంట్ పోలపల్లి సుందర్ తెలిపారు. రాష్ట్రస్థాయి అబాకస్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు.

'పంట రుణాలను మాఫీ చేయాలి'

నవీపేట, ఫిబ్రవరి 26: రైతులకు సంబంధించిన అన్ని పంట రుణాలను మాఫీ చేయాలని ఏఐకేఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు దేవేందర్ సింగ్ కోరారు. సోమవారం ఆయన నవీపేటలో మాట్లాడుతూ 50ఏళ్లు నిండిన రైతులకు రూ.5వేల పింఛన్ చెల్లించాలని, స్వామినాథన్ కమిటీ సిఫారసుల ప్రకారం ఎంఎస్‌పీ చట్టాన్ని అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కిషన్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

నలంద పాఠశాలలో 'ఇంగ్లీష్ ఫెస్ట్'

పెర్కిట్, ఫిబ్రవరి26: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో గల మామిడిపల్లి నలంద పాఠశాలలో నిర్వహించి ఇంగ్లీష్ ఫెస్ట్ కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ రాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంగ్లీష్ యొక్క ప్రాధాన్యత, విద్యార్థులు గ్రామర్‌పై ప్రత్యేకశ్రద్ధ తీసుకొని ఆకట్టుకునే విధంగా ఇంగ్లీష్‌లో మాట్లాడాలని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఇందులో మున్సిపల్ కమిషనర్ రాజు,ఉపాధ్యాయులు సమీర్, బార్గవి, వాసవి, పాతిమ, అలీన, తదితరులు ఉన్నారు.

నేటి నుంచి స్వామివారి బ్రహ్మోత్సవాలు

ఏర్గట్ల, ఫిబ్రవరి 26: మండలంలోని తొర్తి గ్రామంలో నేటి నుంచి వేంకటేశ్వరస్వామి వారి బ్రహోత్సవాలు ఆదర్శ సంఘం ఆధ్వర్యంలో ప్రారంభం కానున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారి అభిషేకం, విశ్వక్‌సేన ఆరాధన, వాసుదేవ స్వసిత పుణ్యవచనము, రక్షా బంధనము, 28, 29, 1న నిత్య పూజా కార్యక్రమాలు 2వ తేదీన స్వామి వారి కల్యాణ మహోత్సవము, రాత్రి 9 గంటలకు రథోత్సవము, 3వ తేదీన జాతర అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు తిరునగరి వేణుగోపాల స్వామి తెలిపారు. ఇట్టి బ్రహ్మోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

సిద్దులగుట్టపై ఘనంగా పల్లకీ సేవ

పెర్కిట్, ఫిబ్రవరి 26: ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్దులగుట్టపై ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సిద్దేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్దులగుట్ట శివాలయంలో సిద్దేశ్వరునికి పంచామృతలతో అభిషేకాలు నిర్వహించి అన్నప్రసాదం అందజేశారు. నందీశ్వర మహరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పల్లకి సేవలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గుట్టపైకి విచ్చేసిన భక్తులకు పైపుల రాజారెడ్డి అంకాపూర్ లాలన ఆశ్రమం మాడవేడి శ్రీకాంత్, తెడ్డు చిన్న రాజన్న కుటుంబసభ్యులు అన్నప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బి.సుమన్, పీసీ.గంగారెడ్డి, కోడిగెల మల్లయ్య, హజరి సతీష్, బోండ్ల ఆనంద్, రవి, సంధ్య, సురాజ్, బట్టు శంకర్, ఆర్మూర్ భజన మండలి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వర ఆలయంలో పూజలు

నవీపేట, ఫిబ్రవరి 26: మండలంలోని నాళేశ్వర్‌లోని చారిత్రక రాజరాజేశ్వర ఆలయంలో సోమవారం మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. వచ్చే నెల 8న జరిగే మహ శివరాత్రిని పురస్కరించుకుని ఆలయంలో జరిగే ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బినోల సొసైటీ చైర్మన్ హన్మాండ్లు, మాజీ సర్పంచ్ సరిన్, ప్రవీణ్, సంపత్, పోతన్న, సురేష్, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆర్మూర్‌లో 'విజయ సంకల్ప యాత్ర'

ఆర్మూర్ టౌన్, ఫిబ్రవరి 26: పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తా వద్ద బీజేపీ విజయ సంకల్ప యాత్ర జరగనుందని బీజేపీ నాయకులు తెలిపారు. సోమవారం ఆర్మూర్ పట్టణంలో జరిగే ఈ యాత్రలో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే.అరుణ, ఎంపీ ధర్మపురి అర్వింద్, ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డిలు పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా విజయ సంకల్ప యాత్ర పోస్టర్లను వారు ఆవిష్కరించారు. ఈ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ.నర్సింహరెడ్డి, మాజీమున్సిపల్ చైర్మన్ కంచెట్టి గంగాధర్, అసెంబ్లీ కన్వీనర్ పాలెపురాజు, ద్యాగ ఉదయ్, కలిగోట గంగాధర్, యామాద్రి భాస్కర్, ఆకుల శ్రీనివాస్, పాన్‌శీను, పోల్కం వేణు, మందుల బాలు, పులి యుగంధర్, తదితరులు పాల్గొన్నారు.

బోధన్ ఆర్‌వోబీ పనులకు వర్చువల్‌గా ప్రధాని మోదీ శంకుస్థాపన

బోధన్ రూరల్, ఫిబ్రవరి 26: అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా బోధన్‌లో ఆర్‌వోబీ పనులకు సోమవారం దేశ ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. బోధన్ పట్టణంలోని గాంధీపార్కు రైల్వే స్టేషన్ సమీపంలో ఆర్‌వోబీ పనుల శంకుస్థాపనకు నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ హజరయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశంలోని రైల్వే స్టేషన్‌ల ఆధునికీకరణకు కృషి చేస్తోందన్నారు. రైల్వే ట్రాక్‌ల వద్ద రద్దీని తగ్గించేందుకు ఆర్‌వోబీలను కోట్లాది రూపాయలతో ప్రభుత్వం నిర్మిస్తోందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో 5ఆర్‌వోబీ పనులు కొనసాగుతున్నాయన్నారు. బోధన్‌లో ఆరో ఆర్‌వోబీని మంజూరు చేశామన్నారు. ఆర్‌వోబీ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. మిగిలిన ప్రాంతాల్లోనూ ఆర్‌వోబీల నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పద్మా శరత్ రెడ్డి, బీజేపీ నాయకులు మేడపాటి ప్రకాష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

















భిక్కనూరులో మాట్లాడుతున్న ఎంపీ బీబీ పాటిల్

జహీరాబాద్ ఎంపీ టికెట్ మళ్లీ నాకే..

● ఎంపీ బీబీ పాటిల్

భిక్కనూరు, ఫిబ్రవరి 26: బీఆర్ఎస్ పార్టీ నుంచి జహీరాబాద్ ఎంపీ టికెట్ మళ్లీ తనకే వస్తుందని ఎంపీ బీబీ పాటిల్ అన్నారు. సోమవారం భిక్కనూరు మండలంలోని భిక్కనూరు రైల్వేస్టేషన్, సిద్ధరామేశ్వర ఆలయ సమీపంలో నిర్మించిన రైల్వే అండర్ పాస్ బ్రిడ్జిల ప్రారంభోత్సవంలో ఎంపీ పాల్గొని మాట్లాడారు. ప్రధాని మోదీ, కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ డివిజన్‌లోని రైల్వేస్టేషన్లు, రైల్వేలైన్లు, బ్రిడ్జిలు, ఎంతగానో అభివృద్ధి చెందినట్లు తెలిపారు. వికసిత్ భారత్‌లో భాగంగా దేశంలోని అన్నిరంగాల అభివృద్ధికి మోదీ కృషిచేస్తున్నారని కొనియాడారు. జహీరాబాద్ ఎంపీ టికెట్ ఈసారి పోచారం భాస్కర్‌రెడ్డికి వస్తున్నట్లు పుకార్లు వినిపిస్తున్నాయని విలేకరులు ప్రశ్నించగా.. అలాంటి పుకార్లు నమ్మొద్దని, తనకే ఈసారి కూడా జహీరాబాద్ టికెట్ వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, ఎంపీటీసీ చంద్రకళ, మాజీ సర్పంచ్ తునికి వేణు, తదితరులు పాల్గొన్నారు.

● కార్యకర్తలకు అండగా ఉంటా..

సదాశివనగర్: బీఆర్ఎస్ పార్టీ అధికారంలో లేదని కార్యకర్తలు ఎవరూ అధైర్య పడవద్దని, ప్రతీఒక్కరికి ఎల్లవేళలా అండగా ఉంటానని జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్ అన్నారు. సోమవారం మండలంలోని పద్మాజీవాడి చౌరస్తాలో ఆయా గ్రామాల కార్యకర్తలు బాన్సువాడ వెళ్తున్న ఎంపీని కలిశారు. ఈ సందర్భంగా కార్యకర్తలతో మాట్లాడుతూ కార్యకర్తలు, నాయకులకు ఏ సమస్య వచ్చిన తనకు ఫోన్ ద్వారా తెలియజేయాలని సాధ్యమైనంత వరకు సమస్య పరిష్కరించడానికి కృషిచేస్తానన్నారు. ఇప్పటికే సదాశివనగర్ మండలానికి రూ.50లక్షల నిధులు మంజూరుచేశానని సమస్యలను తన దృష్టికి తెస్తే పరిష్కరిస్తానన్నారు. సీనియర్ నాయకుడు నర్సారెడ్డి సర్వీస్‌రోడ్డుపై ప్రస్తావించగా మరోసారి అధికారులతో మాట్లాడతానని తెలిపారు కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలలను సందర్శించిన ఎంఈవో

రాజంపేట, ఫిబ్రవరి 26: మండలంలోని ఆర్గోండ ప్రాథమిక పాఠశాల, బస్వన్నపల్లి ఉన్నత పాఠశాలను సోమవారం ఎంఈవో రామస్వామి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం నిలిచిన విషయం తెలుసుకుని పాఠశాలలను సందర్శించానని, విద్యార్థుల తల్లిదండ్రులకు మధ్యాహ్నభోజనం ఆవశ్యకతను వివరించినట్లు తెలిపారు. ఒకరిద్దరు మిడ్‌డే మిల్స్ కోసం వంట చేయడానికి ముందుకు వచ్చారని, రెండు పాఠశాలల్లో మధ్యాహ్నభోజనం పునఃప్రారంభం అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఉన్నారు.

వైస్‌ఎంపీపీ అవిశ్వాసానికి సిద్ధమవుతున్న ఎంపీటీసీలు

మాచారెడ్డి, ఫిబ్రవరి26: మండల వైస్‌ఎంపీపీ జీడిపల్లి నరసింహారెడ్డిపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు మండల ఎంపీటీసీలు మంతనాలు జరుగుతున్నట్లు సమాచారం. వైస్‌ఎంపీపీ ఇటీవల ప్రభుత్వ సలహాదారుడు మాజీ మంత్రి షబ్బీర్ అలీని కలిశారు. దీంతో వైస్‌ఎంపీపీ కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నాడని మండలంలోని తొమ్మిది ఎంపీటీసీలు ఈనెల 25న రహస్యప్రదేశంలో సమావేశం ఏర్పాటుచేసుకుని చర్చించుకున్నట్లు తెలిసింది. అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు ఎంపీపీ నర్సింగ్‌రావు మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్‌కు తెలియజేసినట్లు సమాచారం. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎంపీపీ, జడ్పీటీసీకి జరిగిన వివాదంలో వైస్‌ఎంపీపీని బీఆర్ఎస్ పార్టీ సస్పెండ్ చేసింది. పార్టీ కార్యక్రమాల్లో చురుకుగానే పాల్గొంటూ వచ్చాడు. ఇటీవల కాంగ్రెస్ పార్టీ నాయకులతో మంతనాలు జరపడంతో కాంగ్రెస్‌లో చేరేందుకు సుముఖంగా ఉన్నట్లు సమాచారం.

కాంగ్రెస్‌లో చేరిన సింగిల్ విండో చైర్మన్

సదాశివనగర్, ఫిబ్రవరి 26: సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామపీఏసీఎస్ చైర్మన్ సదాశివరెడ్డి, మాజీ మార్కెట్ కమిటి డైరెక్టర్ సిదిరాములు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామాచేసి సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ సభ్యుడు ఇర్షద్, సాగర్‌రెడ్డి, రాంరెడ్డి,రాములు,భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కిక్కిరిసిన సిద్ధరామేశ్వర ఆలయం

భిక్కనూరు, ఫిబ్రవరి 26: మండల కేంద్రంలోని దక్షిణకాశీగా బాసిల్లుతున్న శ్రీసిద్ధరామేశ్వర ఆలయం సోమవారం సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుండే భక్తులు ఆలయానికి చేరుకుని మూలబావి వద్ద స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మంచిరోజు కావడంతో ఆలయ ప్రాంగణంలో పెద్దఎత్తున అన్నప్రాసన, అభిషేకాలు, పుట్టువెంట్రుకలు, సత్యనారాయణ వ్రతం కార్యక్రమాలను భక్తులు నిర్వహించారు. కాగా స్వామివారిని ఎంపీ బీబీపాటిల్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ మేరకు ఎంపీకి ఆలయ అర్చకులు, సిబ్బంది, ఆలయ కమిటీ సభ్యులు ఘనస్వాగతం పలికారు.



ఆలయంలో స్వామివారిన భక్తులు దర్శించుకుంటున్న భక్తులు

ఉద్యోగులు విధులను సక్రమంగా నిర్వహించాలి

● విద్య, వైద్యశాఖలపై కలెక్టర్ ప్రత్యేక దృష్టిసారించాలి ● ఉపాధ్యాయులు విధులు సక్రమంగా నిర్వహిస్తేనే విద్యార్థులకు భవిష్యత్తు

● విధుల్లో అలసత్వం వహించేవారిపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలి: ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ



మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ



షబ్బీర్‌అలీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేసిన బీఆర్ఎస్ నాయకులు

కామారెడ్డిటౌన్, ఫిబ్రవరి26: ఉద్యోగులు ఆత్మపరిశీలన చేసుకుని సక్రమంగా విధులు నిర్వహించాలని ప్రభుత్వ సలహదారుడు షబ్బీర్‌అలీ సూచించారు. సోమవారం ప్రధాన ఉద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో టీఎన్‌జీవోస్ క్యాలెండర్లను, డైరీల ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగులు సమయపాలన పాటిస్తూ విధులు సక్రమంగా నిర్వర్తించి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు వందశాతం అమలయ్యే విధంగా ఉద్యోగులు చూడాలన్నారు. ప్రజలు కట్టే పన్నుల ద్వారా జీతం తీసుకుంటున్నామని ఉద్యోగులు ఆత్మపరిశీలన చేసుకుని సక్రమంగా పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా ఉపాధ్యాయులు తమ విధులను సక్రమంగా నిర్వహిస్తేనే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. విద్య, వైద్యశాఖలపై కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. విధుల్లో అలసత్వం చూపిన వారిపై విధులకు రాకుండా సంతకాలు చేస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉద్యోగులు వారి జీతాల కోసం వేచిచూసే పరిస్థితి ఏర్పడిందని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నెలలోని మొదటితేదినే జీతాలు ఇచ్చే కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. రాష్ట్రాన్ని అన్నిరంగాల్లోనూ అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వపథకాలు వందశాతం అమలయ్యేలా ప్రభుత్వఉద్యోగులు చూడాలన్నారు. మంగళవారం నుంచి ఉచిత విద్యుత్, రూ.500కే సిలిండర్ అందించే మరోరెండు పథకాలను ప్రారంభించనున్నామని తెలిపారు. ఇప్పటికే 27వేల ఉద్యోగాలు ఇచ్చామని, వంద రోజుల్లో 50వేల ఉద్యోగాలు ఇవ్వనున్నామని వెల్లడించారు. అనంతరం కలెక్టర్ జితేష్ వి.పాటిల్ మాట్లాడుతూ ఉద్యోగులు సమిష్టిగా పనిచేసి జిల్లాను అన్నిరంగాలలో మొదటిస్థానంలో ఉండేలా చూడాలని తెలిపారు. జిల్లాలో ప్రజాపాలన కార్యక్రమం విజయవంతం కావడానికి ఉద్యోగుల కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు, నాయకులున్నారు.

● ఇచ్చిన ప్రతీ హామీని నేరవేర్చుతాం

భిక్కనూరు: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతీ హామీని ఖచ్చితంగా నేరవేర్చుతామని ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్‌అలీ అన్నారు. సోమవారం భిక్కనూరు మండలంలోని బస్వాపూర్, లక్ష్మీదేవునిపల్లి, కాచాపూర్ గ్రామాలకు చెందిన సుమారు 200లమంది బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్‌అలీ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మహిళలకు ఇచ్చిన హామీ మేరకు బస్సుల్లో ఫ్రీ జర్నీ, ఆరోగ్యశ్రీ పథకం ద్వారా వైద్యసేవలకు రూ,10లక్షల వరకు పెంచినట్లు చెప్పారు. కొన్నిరోజుల్లోనే బీఆర్ఎస్ ఖాళీ అవుతుందని, రానున్న ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ మెజార్టీ సీట్లు సాధిస్తుందని అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు భీంరెడ్డి, పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, ఎన్ఆర్ఐ సెల్ జిల్లా కన్వీనర్ సుదాకర్‌రెడ్డి, ఎంపీపీ గాల్‌రెడ్డి, నాయకులు బాగారెడ్డి, కుంట లింగారెడ్డి, తుడుం జీవన్, దశరథం, పరమేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



స్టాక్ పరిశీలిస్తున్న డీఏవో

ఫర్టిలైజర్స్ దుకాణాల తనిఖీ

మాచారెడ్డి, ఫిబ్రవరి 26: మండలంలోని వివిధ ఫర్టిలైజర్స్ దుకాణాలు, ప్రాథమిక వ్యవసాయ కోఆపరేటివ్ సొసైటీలను డీఏవో భాగ్యలక్ష్మీ తనిఖీ చేశారు. యూరియా స్టాక్, ఈపాస్‌లో అప్‌డేట్, వివిధ ఎరువు నిల్వల ఎంట్రీలను పరిశీలించినట్లు తెలిపారు. డీలర్లు ఎరువులు ఈపాస్ మిషన్ ద్వారానే ట్రాన్స్‌క్షన్ చేయాలని, ఎరువులు అమ్మిన వెంటనే నమోదు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం

గాంధారి, ఫిబ్రవరి 26: మండలంలోని గండివేట్ గ్రామంలో సీసీరోడ్డు పనులను సోమవారం కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు ఆదేశాల మేరకు గ్రామంలో ప్రజలకు ఇబ్బందులు రోడ్డుకు నిధులు మంజూరు చేసినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణంతో ఇబ్బందులు పోయాయని తెలిపారు.



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న నాయకులు

ధర్మాన్ని రక్షిస్తే.. ధర్మం మనల్ని రక్షిస్తుంది

● ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బీర్కూర్, ఫిబ్రవరి 26: ధర్మాన్ని మనం రక్షిస్తే ధర్మం మనల్ని రక్షిస్తుందని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం బీర్కూర్ మండలం దామరంచ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహాన్ని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు, ప్రధానంగా యువకులు ఛత్రపతి శివాజీ మహరాజ్‌ను ఆదర్శంగా తీసుకుని ఆయన చూపిన మార్గంలో ముందుకు సాగాలన్నారు. శివాజీ మహరాజ్ విగ్రహాన్ని గ్రామంలో ఏర్పాటు చేస్తామని గ్రామ యువకులు తన వద్దకు వచ్చారని, ఈ మేరకు 5.56 లక్షల రూపాయల ఆర్థిక సహాయం చేశానని చెప్పారు. ఈ కార్యక్రమంలో గుడిమేట్ మహరాజ్, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సురేందర్‌రెడ్డి, ఎంపీటీసీ సందీప్, నాయకులు అవారి గంగారాం, వైస్ ఎంపీపీ కాశీరాం, మాజీ సర్పంచ్ విఠల్, కృష్ణారెడ్డి, అంజిరెడ్డి, విశ్వనాథ్‌రావు, వెంకట్‌రెడ్డి, అహ్మద్, నబి, జగన్, నాగభూషణం, యువకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పోచారం



మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసిన కమ్మ సంఘ సభ్యులు

మంత్రిని సన్మానించిన కమ్మ సంఘం సభ్యులు

నసురుల్లాబాద్, ఫిబ్రవరి 26: నసురుల్లాబాద్ మండల కేంద్రానికి చెందిన కమ్మ సంఘ సభ్యులు సోమవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును, బాన్సువాడ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా కమ్మ సంఘం సభ్యులు మాట్లాడుతూ కోటగిరి మండల కేంద్రంలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణకు వెళుతున్న మంత్రిని మార్గ మధ్యంలో ఆపి నసురుల్లాబాద్ కమ్మసంఘం సభ్యులు సన్మానించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు శివప్రసాద్, ఉపాధ్యక్షులు చౌదరి, సంఘం సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తహసీల్దార్‌ను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

పెద్దకొడప్‌గల్, ఫిబ్రవరి 26: జుక్కల్ మండల తహసీల్దార్‌గా ఇటీవలే పదవీ బాధ్యతలు స్వీకరించిన హిమబిందును సోమవారం మండల కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ తహసీల్దార్ ఇటీవల జరిగిన బదిలీలలో భాగంగా మండలానికి వచ్చారని, తహసీల్దార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించడం జరిగిందని తెలిపారు. మండల ప్రజలకు తహసీల్దార్ అందుబాటులో ఉండి సేవలు అందించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ హిమబిందూ మాటాడుతు జుక్కల్ మండలంలో ఉన్న ప్రజలందరికి అందుబాటులో ఉండి సేవలు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు వినోద్, రమేష్ దేశాయ్, విఠల్‌రావ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన వర్ని ఎంపీపీ

వర్ని, ఫిబ్రవరి 26: వర్ని మండల బీఆర్ఎస్ ముఖ్య నాయకులు సోమవారం కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు సమక్షంలో ఎంపీపీ మేక శ్రీలక్ష్మి, ఆమె భర్త వీర్రాజు, జలాల్‌పూర్, కూనిపూర్, వకీల్ ఫారం తాజా మాజీ సర్పంచ్‌లు అనిత వెంకట్ గౌడ్, భూలక్ష్మి సహ పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్ రెడ్డి, డీసీసీ డెలిగేట్ యలమంచిలి శ్రీనివాస్ రావు, కూనిపూర్ రాజిరెడ్డి, భజ్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.



సీసీ రహదారి పనులను ప్రారంభిస్తున్న నాయకులు

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

పెద్ద కొడప్‌గల్, ఫిబ్రవరి 26: పెద్ద కొడప్‌గల్ మండల కేంద్రంలో 9వ వార్డులో సోమవారం ఉపాధిహామి నిధులతో సిసి రహదారి పనులను మండల పార్టీ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామంలోని వీధులలో వానాకాలం వచ్చిందంటే వర్షపు నీటితో ఇబ్బందులు ఉండేవని, ఈ విషయం గురించి జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావ్ దృష్టికి తీసుకరావడంతో స్పందించిన ఎమ్మెల్యే ఉపాధి నిధులు సిసి రహదారి కోసం మంజూరు చేశార ని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాగిరెడ్డి, మోహన్, బస్వరాజ్ దేశాయ్, గడ్డం అంజిరాం, పండరి, శ్రీనివాస్ గౌడ్, బాల్‌రాజ్, దేవగౌడ్, మాణిక్ రెడ్డి సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ అహంకారం తగ్గలేదు

● ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్

నిజామాబాద్అర్బన్, ఫిబ్రవరి 26: గత ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌ను తిరస్కరించినా.. కేటీఆర్ అహంకారం మాత్రం తగ్గలేదని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌గౌడ్ విమర్శించారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ రేవంత్‌రెడ్డిని ముందుగా సీఎంగా ప్రకటిస్తే 30సీట్లు కూడా రాకపోయేవని కేటీఆర్ వ్యాఖ్యానించడం ఆయన అహంకారానికి నిదర్శనమన్నారు. కేసీఆర్, కేటీఆర్, కవితల అహంకారమే గత ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమికి ప్రధానకారణమని వాటిని మరచి రైతుబిడ్డ, సామాన్యుడు రేవంత్‌రెడ్డి సీఎం అయితే తట్టుకోలేక పోతున్నారన్నారు. కామారెడ్డిలో కేసీఆర్ రేవంత్‌రెడ్డి పోటీచేయడమే సీఎంగా డిక్లేర్ చేయడమని ప్రజలు రేవంత్ రెడ్డి సీఎం అవుతాడనే కాంగ్రెస్‌కు పట్టం కట్టారన్నారు. ముందుగా సీఎంను ప్రకటించే సంస్కృతి కాంగ్రెస్‌లో లేదని, ఒకవేళ రేవంత్‌ను సీఎంగా ప్రకటించి ఉంటే కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావులు గత ఎన్నికల్లో గెలిచేవారు కాదన్నారు. కాళేశ్వరం పేరుతో అడ్డగోలుగా దోపిడికి పాల్పడి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన బీఆర్ఎస్‌కు వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు ఇంటిదారి పట్టిస్తారన్నారు. రాష్ట్రంలో ఒక్క ఎంపీ సీటు కూడా గెలిచే పరిస్థితి బీఆర్ఎస్‌కు లేదని ఎమ్మెల్సీ అన్నారు.



బాధితులకు సెల్‌పోన్లు అప్పగిస్తున్న పోలీసులు

బాధితులకు సెల్‌ఫోన్ల అందజేత

బాన్సువాడ, ఫిబ్రవరి 26: బాన్సువాడ పోలీస్ స్టేషన్ పరిధిలోని సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న నలుగురు బాధితులకు సోమవారం డీఎస్పీ సత్యనారాయణ చేతుల మీదుగా సెల్‌ఫోన్లను అందజేశారు. బాన్సువాడ పట్టణానికి చెందిన నలుగురు బాధితుల సెల్‌ఫోన్లు పోగొట్టుకోవడంతో సీఈ ఐఆర్ పోర్టల్ ద్వారా వెతికి పట్టుకుని బాధితులకు తిరిగి అప్పగించినట్లు ఆయన తెలిపారు. నలుగురు సెల్‌ఫోన్లను అప్పగించిన పోలీస్ సిబ్బందికి బాధితులు అభినందనలుతెలిపారు. ఇప్పటివరకు 250 సెల్‌ఫోన్లు రికవరీ చేసి జిల్లాలో బాన్సువాడ పోలీస్ స్టేషన్ ముందంజలో ఉందన్నారు. 2 ఫోన్లను దుబాయ్, నేపాల్ నుంచి, దాదాపు 20 ఫోన్లను 11 రాష్ట్రాల నుంచి తెప్పించి బాధితులకు అప్పగించినట్లు డీఎస్పీ తెలిపారు. సెల్‌ఫోన్లను అప్పగించేందుకు అత్యంత కృషిచేసిన సీఈ ఐఆర్ ఆపరేటర్ రాజేశ్వర్‌ను డీఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో పట్టణ సిఐ కృష్ణ, పోలీస్ సిబ్బంది తదితరులున్నారు.

గణితఫోరం ఉపాధ్యక్షుడిగా కుమారస్వామి

బాన్సువాడటౌన్ , ఫిబ్రవరి 26: హైదరాబాద్‌లో జరిగిన గణితఫోరం సమావేశంలో రాష్ట్ర గణితఫోరం ఉపాధ్యక్షుడిగా నీల కుమారస్వామి ఎన్నికైనట్లు సభ్యులు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పజెప్పిన రాష్ట్ర గణితఫోరం కార్యవర్గానికి, సభ్యులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి రామారావు, కోశాధికారి నరహరి, రామకృష్ణ, సిద్దరామాగౌడ్ తదితరులున్నారు.

'పోస్టాఫీస్‌లో బీమా చేయాలి'

పెద్ద కొడప్‌గల్, ఫిబ్రవరి 26: మండలంలో ఉన్న ప్రజలందరూ స్థానికంగా ఉన్న పోస్టాఫీస్‌లో బీమా చేసి ధీమాగా ఉండాలని పెద్ద కొడప్‌గల్ బీపీఎం పండరి సూచించారు. సోమవారం మండల కేంద్రంలో గల పోస్టాఫీస్‌లో బీమా పథకాలపై ప్రజలకు అవగాహన కల్గించారు. ఈ సందర్భంగా పండరి మాట్లాడుతు పోస్టాఫీస్‌లో తక్కువ ప్రీమియంతో ఎక్కువ బీమా పొందవచ్చని తెలిపారు. ప్రస్తుతం తమ శాఖ ద్వారా 520 రూపాయల నగదుతో 10 లక్షల ప్రమాద బీమా పొందవచ్చని తెలిపారు. 18 సంవత్సరాల నుండి 65 సంవత్సరాల వయస్సు గల వారు ఈ పథకానికి అర్హులని సూచించారు. ఈ పాలసీ ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయని సూచించారు. ఆసక్తి గల ప్రజలు తమ శాఖకు వచ్చి ఈ పథకంలో చేరవచ్చని తెలిపారు.

'ఆర్టీసీకి సహకరించిన ప్రయాణికులకు కృతజ్ఞతలు'

బాన్సువాడటౌన్, ఫిబ్రవరి 26: మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర సందర్భంగా బాన్సువాడ డిపో నుంచి 60కి పైగా బస్సులు పంపినట్లు డిపో మేనేజర్ సరితాదేవి తెలిపారు. జాతరకు వెళ్లి అక్కడ పనిచేసిన ఆర్టీసీ సిబ్బందికి అభినందనలు తెలియజేశారు. అదేవిధంగా బస్సులు తక్కువగా నడిచినప్పటికీ ప్రయాణికులు సహకరించడం ఆనందదాయకమన్నారు. ప్రయాణికులందరికీ ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వారోత్సవాలను విజయవంతం చేయాలి

నిజామాబాద్అర్బన్, ఫిబ్రవరి 26: రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 26నుంచి మార్చి 1వరకు నిర్వహించే ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను విజయవంతం చేయాలని నిజామాబాద్ అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ పిలుపునిచ్చారు. వారోత్సవాలను పురస్కరించుకుని లీడ్ బ్యాంకు ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్లను సోమవారం ఆయన ఇతర అధికారులతో కలిసి ఆవిష్కరించారు.

'కార్పొరేట్, మతతత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడుదాం'

కామారెడ్డిటౌన్, ఫిబ్రవరి26: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్, మతతత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడుదామని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లాకార్యదర్శి రామకృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లాకేంద్రంలో వాహనాల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం కార్పొరేట్‌ల కొమ్ముకాస్తూ పేదప్రజల్ని నిలువుదోపిడీకి గురిచేస్తుందని అన్నారు. ఇంకోవైపు మతతత్వ రాజకీయాలతో ప్రజల్లో మతవిద్వేషాల్ని రెచ్చగొడుతుందని తెలిపారు .దేశంలో సర్వం సంపదను కార్పొరేటర్లకు కట్టబెడుతూ ఊడిగం చేస్తోందని అన్నారు. పదేళ్ల తన పాలనలో విఫలం చెందిన ప్రధాని మోదీ అన్నింటికి మతం మందు పూస్తున్నాడని ఆరోపించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి ప్రకాష్, ఏఐకేఎస్ జిల్లా అధ్యక్షుడు పరమేష్, ఐఎఫ్‌టీయూ అధ్యక్షుడు బాలరాజ్, నాయకులు కిషోర్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేష్, నాయకులు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి	
ప్రియా 35	- సిద్ధార్థరాయ్
దర్శన్	- హనుమాన్
శాంతి	- ఊరుపేరు భైరవకోన
ప్రియా 70	- ఈగల్

బాన్సువాడ	
వెంకటేశ్వర	- హనుమాన్
మహేశ్వరి	- ఊరుపేరు భైరవకోన

చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	100	170	190
వెన్‌కాబ్(కిలో)	100	180	200

